
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 24 మే 2024 | 5



ఎండా కాలమ్

	గరిష్టం	కనిష్టం
అమలాపురం	37	29

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్



జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అసెంబ్లీ స్థానాల వారీగా పోలైన ఓట్లు, మొత్తం పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కింపు టేబుళ్ల సిద్ధం చేస్తున్నారు. జూన్ 4న ఉదయం ఎనిమిది నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తొలుత లెక్కించనున్నారు. ఆ తర్వాత అసెంబ్లీ స్థానాల వారీగా ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. మొత్తం పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడికి మధ్యాహ్నం రెండు దాటనుంది.



- సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ
- శనివారం నాటికి ఏర్పాట్లు పూర్తి
- జూన్ 4 ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, మే 23:

సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లన్నీ ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో పాటు ఉదయం 8 గంటల నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సిబ్బంది నుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టే విధానాన్ని వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు, పరిశీలకులకు సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ స్థానానికి సంబంధించి ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తామన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరుగా ఓట్ల లెక్కింపు ఆర్వో, ఏఆర్వో పర్యవేక్షణలో జరుగుతుంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గదిలో ఒక రిటర్నింగ్ అధికారి, ఏఆర్వో, గెజిటెడ్ హోదా కలిగిన కౌంటింగ్ సూపరిండెంటెంట్, సహాయకుడు, మైక్రో అబ్జర్వర్‌తో పాటు ఈవీఎంలను అందజేసేందుకు ఇద్దరు వీఆర్వోలను నియమించామన్నారు.

రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలో ఉంటారన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సిబ్బందిని కేటాయించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎటువంటి హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా పోలీసు యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జూన్ 6వ తేదీ వరకు ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, రిటర్నింగ్ అధికారులు వి.మదన్‌మోహనరావు, ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, జి.కేశవర్ధనరెడ్డి, డీపీఎస్ యల్లారావు, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, ఏవో సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.
- రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ స్థానానికి 10 టేబుళ్లు, పార్లమెంటు నియోజకవర్గానికి 10 టేబుళ్ల ఏర్పాటు.
- పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 12 టేబుళ్లు, పార్లమెంటు స్థానానికి 12 టేబుళ్లు.
- రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 14 టేబుళ్ల ఏర్పాటు.
- ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 14 టేబుళ్లు.
- కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 10 టేబుళ్లు.
- అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 12 టేబుళ్లు.
- మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి 10 టేబుళ్లు, పార్లమెంటుకు 10 టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

హింసాత్మక సంఘటనల నేపథ్యంలో

భద్రత కట్టుదిట్టం

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పారా మిలటరీ దళాలతో సెక్యూరిటీ

అమలాపురం టౌన్, మే 23: ఇతర జిల్లాల్లో జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులను ఆయన కోరారు. కలెక్టరేట్‌లో గురువారం పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. హింసాత్మక సంఘటనలు పునరావృతం కాకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కౌంటింగ్ కోసం ఏవిధమైన ఫిర్యాదులు లేని సమర్థవంతమైన అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ ఇప్పిస్తామన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటలకే స్ట్రాంగ్ రూములను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామన్నారు. ఉదయం 6.30 గంటలకు కౌంటింగ్ ఏజెంట్లు ఆ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఏజెంట్లు ప్రతి రౌండు నివేదికలోనూ తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓటర్ల సంఖ్య లెక్కింపు కోసం రెండు చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓటర్లు, ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు సమాంతరంగా జరుగుతుందని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో భాగంగా ప్రతి టేబుల్‌కు రౌండ్‌కు 500 ఓట్లు చొప్పున ఇస్తామన్నారు. సిబ్బంది తప్పిదాలు చేసే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో 819 మంది సర్వీసు ఓటర్లు ఉండగా వారిలో ఇప్పటివరకు 262 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన వారు వినియోగించుకునే సమయం ఇంకా ఉందన్నారు.

ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద సెక్యూరిటీపరంగా సెంట్రల్ పారా మిలటరీ దళాలు ఆయుధాలతో రేయింబవళ్లు భద్రత కల్పిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం చుట్టుపక్కల స్ట్రైకెన్ జోన్‌గా ప్రకటించామన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద మీడియా సెంటర్ ఏర్పాటుచేసి మోనటరింగ్ చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో 214 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ఆ ప్రక్రియను అనుక్షణం చిత్రీకరిస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.





గడియార స్తంభం సెంటర్‌లో కేంద్ర బలగాలపై రాళ్లు రువ్వి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అల్లరి మూకలు, దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో)

ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొంటాం

అమలాపురం టౌన్, మే 23: ప్రశాంతమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మరోసారి నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. గతంలో అమలాపురం అల్లర్ల కేసులో రాష్ట్రంలోనే ఎన్నడూలేని విధంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని బంద్ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా ఈసారి పెట్రోల్ లూజు అమ్మకాలతో పాటు బాణసంచా తయారీ, అమ్మకాలపై నిషేధాజ్ఞలు విధించారు. ఇప్పటికే జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 1952 నుంచి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇటువంటి చోద్యం ఎన్నడూచూడలేదని నాటితరం పెద్దలు చెప్తున్నారు. ఇప్పటివరకు ఎన్నడూ చూడని విధంగా నిషేధాజ్ఞలు విధించడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారిలో ధైర్యాన్ని నింపేందుకు, ప్రజల సహకారంతోనే ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్పీ ఎస్.శ్రీధర్ భరోసా ఇస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు కౌంట్‌డౌన్ మొదలవ్వడంతో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎటువంటి విపత్కర పరిస్థితులు, అల్లర్లనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీసు యంత్రాంగం 45 రోజులుగా కేంద్ర బలగాలతో కలిసి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో కవాతులు నిర్వహిస్తున్నాయి. పోలింగ్ అనంతరం ఇతర జిల్లాల్లో జరిగిన అల్లర్లు, ఘర్షణలను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు తర్వాత అల్లర్లు చెలరేగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ప్రధానమైన ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎటువంటి రికార్డులు లేని వందలాది మోటారు సైకిళ్లతో పాటు ఆటోలను సైతం సీజ్ చేస్తున్నారు. పెట్రో బాంబులు వినియోగించకుండా లూజు పెట్రోలు విక్రయాలను నిషేధించారు.



ఎన్నికల ఓట్ల లెక్కింపు వేళ జిల్లాలో నిషేధాజ్ఞలు: ఎస్పీ శ్రీధర్

పెట్రోలు లూజు అమ్మకాలపై నిషేధం...

బాణసంచా తయారీ, అమ్మకాలు కూడా...

గురువారం సాయంత్రం కేంద్ర బలగాలు కవాతు చేసుకుంటూ గడియార స్తంభం సెంటరుకు చేరుకున్నాయి. మరోవైపున అల్లరిమూకలు ప్లకార్డులు చేతబూని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. దిష్టిబొమ్మలతో పాటు టైర్లను దహనం చేశారు. దాంతో ఒక్కసారిగా అప్రమత్తమైన కేంద్ర బలగాలు వారికి వార్నింగ్ ఇచ్చాయి. అల్లరిమూకలు చెదరకపోవడంతో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారిపై వాటర్ క్యానన్ ప్రయోగించారు. అయినా ఆందోళనకారులు చెదరకపోవడంతో టియర్ గ్యాస్ ప్రయోగించారు. అప్పటికీ ఆందోళన విరమించకపోవడంతో తొలుత గాలిలోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత నేరుగా ఫైరింగ్ చేయడంతో అల్లరిమూకలు చెదిరిపోగా కొందరు గాయపడ్డారు. వారిని 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ఎంతో ఉత్కంఠభరితంగా ఏఆర్ డీఎస్పీ విజయసారధి ఆధ్వర్యంలో పోలీసులు, హోంగార్డులు నిర్వహించిన మాక్ డ్రిల్ ఇది. ఈ సందర్భంగా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యాన్ని నింపడంతో పాటు పోలీసులు ఎటువంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకే మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున ఓట్ల లెక్కింపు అనంతరం ఎవరూ రోడ్లపైకి రాకూడదన్నారు. ఇళ్లల్లోనే ఉండి టీవీల్లో ఎన్నికల ఫలితాలను వీక్షించాలని సూచించారు. రోడ్లపైకి వచ్చి అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా యువత, విద్యార్థులు ఆందోళనకు దిగి తమ బంగారు భవిష్యత్తులను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. అల్లర్లకు పాల్పడిన వారికి పాస్‌పోర్టులు వచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. గత 45 రోజులుగా పోలీసులు నిద్రాహారాలు మాని ప్రజల కోసం పనిచేస్తున్నారని వివరించారు. రాత్రి సమయాల్లో గుర్తింపు కార్డులు లేకుండా రోడ్లపై తిరగరాదని హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, సీఐ కె.క్రిస్టఫర్, స్పెషల్ బ్రాంచి సీఐలు వి.శ్రీనివాస్, బి.రాజశేఖర్, విష్ణుసుందరం పాల్గొన్నారు.







అల్లరిమూకలను చెదరగొడుతున్న బలగాలు, అల్లరి మూకలపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాటర్ క్యానన్ ప్రయోగం, కాల్పుల్లో గాయపడ్డ వ్యక్తిని అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ప్రారంభమైన ఫ్లైఓవర్ పనులు

ఎట్టకేలకు ప్రారంభమైన ఫ్లై ఓవర్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలమూరు, మే 23: సుదీర్ఘ కాలం తర్వాత ఫ్లై ఓవర్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఆలమూరు మండలం జొన్నాడ వద్ద జాతీయ రహదారిపై దాదాపు ఏడాదిన్నర కాలం క్రితం మొదలు పెట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజమహేంద్రవరంలోని మోరంపూడి, జొన్నాడ సెంటర్‌లలో ఫ్లైఓవర్ పనులకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. అయితే మోరంపూడి వద్ద పనులను శరవేగంగా చేస్తూ మరో రెండు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అయితే జొన్నాడలో మాత్రం పిల్లర్లకే పరిమితమైంది. దీనిపై "అక్కడ అలా.. ఇక్కడ ఇలా..." శీర్షికన ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. జొన్నాడ సెంటర్లో 14 నెలలుగా పనులు చేస్తున్నట్టు ఉన్న రోడ్లను తొలగించి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసి నామమాత్రంగా పనులు చేస్తున్నారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాతపడుతున్న సంగతి తెలిసిందే. మధ్యలో నిలిచిపోయిన పిల్లర్ల పనులను గురువారం ప్రారంభించారు. హైవే అధికారులు స్పందించి ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చింతలూరు నూకాంబికా హుండీల ఆదాయం రూ.21.29 లక్షలు

ఆలమూరు, మే 23: మండలంలోని చింతలూరు నూకాంబికా దేవస్థానంలోని హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 35 రోజులకు రూ.21,29,106 ఆదాయం లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ, ప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీల్లో వచ్చిన సొమ్మును లెక్కిస్తున్న దృశ్యం



హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు, గ్రామస్తులు

అయినవిల్లి సిద్ధివినాయస్వామి హుండీల ఆదాయం రూ.22.79 లక్షలు

అయినవిల్లి, మే 23: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామిదేవస్థానంలోని హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 56 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.22,21,485, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.58,071.. మొత్తం రూ.22,79,556 ఆదాయం వచ్చింది. 3.5 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీ వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ ఛైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం


చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 23: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవా లలో భాగంగా గురువారం పంపా సరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెండ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ పంపాతీరం వద్దనున్న ప్రత్యేక వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంపా సరోవరంలో కృత్రిమంగా తీర్చిదిద్దిన కోనేరు వద్దకు తీసుకుని వచ్చి స్వామి,అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శన చక్రంతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదిక వద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ ఐ.వి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.


నవదంపతులను ఎత్తుకుని నృత్యం..

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. అర్చకస్వాములు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యం చేశారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీపుష్పయాగం

సత్యదేవుడికి క్రోధి నామసంవత్సర దివ్య కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రికి జరిగే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 7 గంటలకు స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధ భరిత పుష్పాలతో నవ దంపతులను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీ తాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.


ప్రత్యేక వేదికపై పూజలు నిర్వహిస్తున్న పండితులు

సాగర తీరాన విశేష పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సర్పవరం జంక్షన్, మే 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు గత ఏడు రోజులుగా వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం స్వామి వారి చక్రస్నానం ఘట్టంలో భాగంగా ఆలయ పండితులు మంత్రోచ్చరణలతో పూర్తి శాస్త్రోక్తంగా పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి విగ్రహం, చక్ర పెరుమాళ్లను చినశేషవాహనంపై ఉంచారు. వేలాది మంది భక్తులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్పవరం నుంచి ఊరేగింపుగా తోడ్కొని సూర్యారావుపేట సాగర తీరానికి తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు, చక్ర పెరుమాళ్లకు పూజలు, అభిషేకాలు, అర్చనలు, నీరాజనాలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో పూజలు చేశారు. భక్తుల గోవింద నామ స్మరణతో అత్యంత భక్తశ్రద్ధలతో సముద్రంలో స్నానం ఆచరించిన అనంతరం స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్నారు. బీచ్‌లో పాల్గొన్న భక్తులకు దాతల ఆధ్వర్యంలో పులిహార, చక్రపొంగలితో పాటు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా టెంట్‌లో వసతి కల్పించడం పట్ల మహిళా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం పుష్ప వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కృష్ణబాబు మృతికి ప్రముఖుల సంతాపం


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు

కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లతో పాటు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 చిట్స్ పాటలకు సంబంధించి చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసగించిన ఇద్దరి నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన పైలా నాగేశ్వరరావు, పైలా పవన్‌కుమార్ కలిసి కాకినాడ అపోలో ఆసుపత్రి సమీపంలో దుర్గా, రాధిక చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థను నడిపేవారు. ఈ క్రమంలో స్థానిక జగన్నాథపురానికి చెందిన కాలే సత్య వీరలక్ష్మి అనే మహిళతో 2016 లో చిట్ వాయిదాల రూపంలో రూ. 10 లక్షలు కట్టించుకున్నారు. అన్ని వాయిదాలు కట్టించుకున్న అనంతరం సత్య వీరలక్ష్మికి డబ్బు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకుని తిరగడంతో ఆమె మోసపోయానని గ్రహించింది. అనంతరం బాధితురాలు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి నిందితులిరువురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోసాల కమలకుమారి వాదనలు వినిపించారు.

పోలీసులు హద్దులు మీరితే..ఫిర్యాదు చేయండి

పైసా ఖర్చులేదు.. 6 నెలల్లో పరిష్కారం
పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ విశ్వనాథం


మీడియాతో మాట్లాడుతున్న అథారిటీ చైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకూ వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcarajamahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నెంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కు రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్ర గాయాలు కావడం, భూ కబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోపుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్ఠంగా ఆరు నెలలలోపుగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించామన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత అడిషనల్ ఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది సీహెచ్ మన్మథరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ పరీక్షలు

జేఎన్టీయూకే, మే 23: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్షలు గురువారం ఉదయం సెషన్‌తో ప్రశాంతంగా ముగిసినట్లు సెట్ ఛైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జిల్లాలోని 5పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 930 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 895 మంది హాజరయ్యారని 35 మంది గైర్హాజరు కాగా మొత్తం 96.24 శాతం హాజరు నమోదైందన్నారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 697 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 340 మంది హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్ష ప్రాథమిక కీ ని వీసీ విడుదల చేశారు. రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షల ప్రాథమిక కీ ని శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అంతే కాకుండా ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25 శాతం వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఏపీ రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వాటి ద్వారా వారికి ర్యాంకులు కేటాయించనున్నట్లు కన్వీనర్ సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలున్నా 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించాలన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 కానిస్టేబుల్ పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.విజయబాబు మూడు సంవత్సరాల మూడు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ కొండయ్యపాలెంలో 2020లో ఏఆర్ కానిస్టేబుల్ రాములకొండ బాలరెడ్డిని ఆ ప్రాంతానికి చెందిన వీధి సుబ్రహ్మణ్యం, సవలం పవన్‌కుమార్, యానం సత్యభవాని శంకర్‌లు కలిసి చాకుతో పొడిచారు. అనంతరం బాలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో జరిగిన వాదోపవాదనల అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అయితే నిందితుల్లో వీధి సుబ్రహ్మణ్యం ఇప్పటికే హత్యకు గురి కావడంతో పవన్‌కుమార్, భవాని శంకర్‌లకు న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డేనియల్ దినకర్ జేసన్ వాదనలు వినిపించారు.

సాదాసీదాగా జడ్పీ సమావేశం


జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతున్న సమావేశం


హాజరైన జడ్పీటీసీ సభ్యులు

కాకినాడ సిటీ, మే 23 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలకు లోబడి ఏ విధమైన శాఖాపర సమీక్షలు, తీర్మానాలు చేయకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జడ్పీ సర్వసభ్య సమావేశం, 1,2,4,7 స్థాయీ సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, ఐదో స్థాయీ సంఘ సమావేశానికి స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో జీఎస్ రాంగోపాల్, జడ్పీటీసీ సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

రౌతులపూడి, మే 23: కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామశివారున బుధవారం ఏలేరు కాలువలో పడి గల్లంతైన వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన సికోలు వీరబాబు బుధవారం రౌతులపూడిలో ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఏలేరు కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. గురువారం మధ్యాహ్నం వీరబాబు మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


వరుపుల కారు ఢీకొనడంతో దెబ్బతిన్న మరో వాహనం

పిఠాపురం బైపాస్ రోడ్డులో రెండు కార్లు ఢీ
ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు స్వల్పగాయాలు


దెబ్బతిన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల కారు

పిఠాపురం/ప్రత్తిపాడు, మే 23: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు కార్లల్లో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన బెండపూడి గురువు కుమార్తె అల్లూరి సీతామహాలక్ష్మి కారులో కాకినాడ వెళుతున్నారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న టీపాయింట్ వద్దకు వచ్చేసరికి గేదెలు అడ్డుగా రావడంతో కారును స్లో చేశారు. అదే సమయంలో ఏలేశ్వరం మండలం లింగంపర్తి నుంచి కాకినాడ వెళుతున్న ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. రెండు వాహనాల్లో బెలూన్లు తెరుచుకోవడంతో మాజీ ఎమ్మెల్యే వరుపుల సహా పలువురు అతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వరుపుల వెంటనే మరో వాహనంలో కాకినాడ వెళ్లిపోయారు. వాహన డ్రైవర్లు సుంకర రాజేష్, గుండం నాగేశ్వరరావులకు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల్లోని వారు కాకినాడకు వెళ్లిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉంటే తాను క్షేమంగానే ఉన్నానని, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాకినాడ ఎవరూ రావద్దని వరుపుల సుబ్బారావు ఓ వీడియో సందేశం పంపారు.

ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మామిడికుదురు, మే 23: ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలను గురువారం బుద్ధ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధుని జీవిత విశేషాలతో కూడిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, బుద్ధవిహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు నడిచిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, బయ్యా మోహన్, అడపా వెంకటరత్నం, బళ్ల శ్రీనివాసరావు, పులపర్తి కృష్ణ, యర్రంశెట్టి తాతబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల వేషధారణలో బ్లేడ్‌బ్యాచ్ దందాలు


రాజమహేంద్రవరం రూరల్, మే 23: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులో అర్ధరాత్రి దాటాక బ్లేడు బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరుతున్నాయి. గత కొద్ది రోజులుగా కొన్ని బ్యాచ్‌లు గామన్ బ్రిడ్జి దిగువన గోదావరి గట్టు వద్దకు చేరి మద్యం మత్తులో రోడ్డుపైకి వచ్చి అటుగా వెళ్లే వాహనాలకు అడ్డంగా నిలబడి దందాలు చేస్తున్నారు. బ్లేడులు, కత్తులు, బీరు సీసాలు చేతపట్టుకుని భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గత అర్ధరాత్రి ఈ బ్యాచ్‌లలో రెండు వర్గాలకు గొడవలు జరిగి రోడ్డుపై రాడ్‌లతో కొట్టుకుని దారుణంగా వ్యవహరించారని అటుగా లారీలో వెళ్లిన ఒక డ్రైవర్ తెలిపారు. లారీ ఆపి కిందకు దిగితే దాడి చేస్తారనే భయపడి ఆపకుండా వెళ్లిపోయినట్టు ఆ డ్రైవర్ చెప్పాడు. కొంత మంది యువకులు హిజ్రాల వేషధారణలో తిరుగుతున్నట్లుగా కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కాతేరు గ్రామంలో మెయిన్ రోడ్డు, మల్లయ్యపేట, గణపతినగర్, ఆనంద్ నగర్ రోడ్డు, శాంతి నగర్ రోడ్డు ప్రాంతాల్లో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటాక బైక్‌లు, స్కూటీలు వేసుకుని ఇనుప రాడ్‌లు, బ్లేడ్‌లు పట్టుకుని మత్తులో తిరుగుతున్నారని వారిని ఎవరని నిలదీస్తే దాడి చేసే పరిస్థితి ఉండడంతో ఎవరూ కూడా బయటకు రావడం లేదు. మత్తులో బ్లేడ్ బ్యాచ్‌లు, హిజ్రాల వేషాధారణతో కొంత మంది, బైక్‌లు దొంగతనాలు చేసేందుకు మరికొంత మంది ఇలా తిరగడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

మోదీ నేతృత్వంలో మరో ప్రభంజనం

మలికిపురం, మే23: బీజేపీ 400 స్థానాలను గెలుచుకుంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంపి వేమా అన్నారు. మలికిపురంలో అడబాల రాంబాబు అధ్యక్షతన గురువారం జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడుతుందని, మోదీ ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతిని వెలికితీసి బాధ్యులు ఎంతటి వారైనా జైలుకు పంపడం తథ్యమన్నారు.

పీఠంలో ఘనంగా వైశాఖ పౌర్ణమి పూజలు






రాయవరం: వెదురుపాక విజయదుర్గమ్మ, మామిడికుదురు:పెదపట్నంలంక గ్రామదేవత మహాలక్ష్మమ్మ, అంబాజీపేట: ఇటికాలమ్మ అమ్మవారు, కె.గంగవరం: సత్యవాడ గ్రామదేవత వనుము లమ్మ

రాయవరం, మే23: వెదురుపాక విజయదుర్గా పీఠంలో వైశాఖ పౌర్ణమి పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో వేదపండితుడు చీమలకొండ వీరావధాని అర్చకత్వంలో తొలుత భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళఅర్చన, నవగ్రహ నక్షత్ర హోమం జరిపారు. విజయదుర్గాఅమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు అనంతరం దుర్గా అష్టోత్తర, సహస్ర నామాలు, లలితా, లక్ష్మీ, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నసమారాధన చేశారు. విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బి.రమ, వీఆర్వో బాబి పాల్గొన్నారు.

ఘనంగా వనుములమ్మ జాతర

కె.గంగవరం, మే 23: సత్యవాడ గ్రామదేవత వనుములమ్మ జాతర బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురువారం అమ్మవారికి తీర్థం జరిగింది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గం రామచంద్రపురం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సత్యవాడ ఉపసర్పంచ్ సలాది శ్రీను, నాయకులు తోట వెంకన్న, సలాది వెర్రిబాబు, సలాది రమేష్, సలాది ప్రకాష్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట, మే 23: మాచవరం గ్రామదేవత శ్రీఇటికాలమ్మ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జాతర జరిగింది. జాతరలో ఏర్పాటుచేసిన గరగనృత్యాలు, కోయిడ్యాన్సులు, సంగీత విభావరి అలరించాయి. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థం సందర్భంగా అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆడపడుచులతో గ్రామమంతా కళకళలాడింది.

ఘనంగా శివకేశవులకు చక్రస్నానం

అంబాజీపేట, మే 23: గంగలకుర్రు అగ్రహారం కౌశిక నదీతీరాన వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వర స్వామి, శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివార్ల చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవాచార్యుల ఆధ్వర్యంలో గొర్తి పల్లయ్య పంతులు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవంలో భాగంగా స్వామి వారి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు.

26నుంచి మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు, మే 23: పెదపట్నంలంక గ్రామదేవత మహాలక్ష్మమ్మవారి జాతరను ఆదివారం నుంచి మూడు రోజులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. ఆదివారం రాత్రి జాతర, సోమవారం నైవేద్యాలు, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం, మే 23: వైశాఖ పూర్ణిమ సందర్భంగా మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పేటేటి శ్యామలకుమార్ అర్చకత్వంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆకొండి కిరణ్, 120మంది భక్తులు పాల్గొన్నారు.

శాంతియుత సహజీవనానికి బౌద్ధ ధర్మమే మార్గం

- ప్రముఖ బౌద్ధ భిక్కు మహాతేరో ఆయుపాలభిక్కు
- ఘనంగా వైశాఖ పౌర్ణమి ఉత్సవాలు
- త్రిశరణ, పంచశీల పఠనం

అమలాపురం టౌన్, మే 23: ప్రముఖ గ్రంథాల్లోని జ్ఞానం కన్నా అనుభవమే ఎప్పుడూ శ్రేష్ఠమని తథాగతుడు ఎందరికో జ్ఞానోదయం కల్పించారని బర్మాకు చెందిన ప్రముఖ బౌద్ధ భిక్కు మహాతేరో ఆయుపాలభిక్కు పేర్కొన్నారు. ఎవరికి వారు ఆధ్యాత్మిక ప్రయోగాలను చేసి సత్ఫలితాలను పొందాలన్నారు. గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకుని అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో గురువారం బుద్ధవిహార్ రూపశిల్పి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, త్రిరత్న బుద్ధవిహార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో తొలుత సెక్రటరీ జనరల్ డీబీ లోక్, బీఎస్ఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంబాబు, బుద్ధవిహార్ అధ్యక్షుడు నాగాబత్తుల ప్రసాదరావు ఆధ్వర్యంలో త్రిశరణ, పంచశీల పఠనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో బుద్ధ భగవానుని ప్రతిమను ఉంచి పంచశీల జెండాలతో బుద్ధవిహార్ నుంచి పురవీధుల మీదుగా నల్లవంతెన దిగువన ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వరకు ఊరేగింపు నిర్వహించారు. అంబేడ్కర్ భవన్‌లో తొలుత బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు కాశి రాంబోధి ఆధ్వర్యంలో గౌతమబుద్ధుని విగ్రహం వద్ద బర్మా నుంచి వచ్చిన మహాతేరో ఆయుపాలభిక్కు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. గౌతమబుద్ధుడు చూపినబాట యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయమని వివరించారు. ఆయన బోధనలే శాంతియుత సహజీవనానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ఏవిషయాన్నైనా గుడ్డిగా నమ్మవద్దని బౌద్ధం చెబుతుందన్నారు. జ్ఞానం అంటే ప్రశ్నించడమని, అనుభవానికి రానంతవరకు ఏ విషయాన్ని విశ్వసించవద్దన్న గౌతమబుద్ధుని బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వై.హరిబాబు, వీవీ దుర్గారావు, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, సాధనాల సత్యనారాయణ, గెడ్డం ప్రదీప్, ములపర్తి సత్యనారాయణ, దోనిపాటి ఆంజనేయులు, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, ఈవీవీ సత్యనారాయణ, గుంటు సురేష్‌బాబు, ఎ.బ్రహ్మేశ్వరరావు, జి.శాంతికుమార్ పాల్గొన్నారు. గొల్లపల్లి సూర్యారావును 'ఆంధ్ర అనాథ పిండక' బిరుదుతో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ సత్కరించింది.




అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న గొల్లపల్లి సూర్యారావు తదితరులు, ముమ్మిడివరం: బుద్ధవిహార్‌లో నివాళులర్పిస్తున్న బుద్ధిస్టులు

బుద్ధ జయంతి

ముమ్మిడివరం, మే 23: బుద్ధ జయంతి సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, ఇతర అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున ఉన్న జై బుద్ధ పార్కులో బుద్ధునికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ప్రముఖ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు సమాజంలో శాంతి, సమసమాజ స్థాపనకు తోడ్పాటునిస్తాయన్నారు. బౌద్ధం మానవహక్కుల పరిరక్షణకు మార్గమని, ప్రతి ఒక్కరూ బుద్ధుని ఆలోచనలను అనుసరించి జీవనం సాగించడం ద్వారా రాగద్వేషాలను విడనాడి సమాజంలో శాంతి స్థాపనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, కాశి బాబుజగ్జీవన్‌రామ్, కాశి సింహాద్రివర్మ, యలమంచిలి బాలరాజు, కాశి సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, తటవర్తి నాగరాజారావు, పచ్చిమట్ల ఉదయభాస్కరవర్మ, పీవీఎస్ఎన్ వర్మ, ఎన్.అబ్బులు, మట్టా శ్రీను, ఎస్వీ సత్యనారాయణ, టీవీ చక్రవర్తి, పలివెల నరేష్,వై.కాంతారావు, వెంకటపతిరాజు, మెండి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పౌర్ణమి పూజలు

కె.గంగవరం, మే 23: పాణింగపల్లి సాయిబాబా ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు భక్తులు క్షీరాలాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. జరిగిన అన్నసమారాధనలో భక్తులు బాబా ప్రసాదం స్వీకరించారు.

24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 23: రామచంద్రపురం నియోజకవర్గానికి సంబంధిచి ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ తెలిపారు. జూన్ 4న కాట్రేనికోన మండలం చెయ్యేరులో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్వామి వివేకానంద బ్లాక్‌లో ఓట్ల లెక్కింపునకు పది టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు, ఒక పర్యవేక్షకుడు, ఒక సహాయకుడిని నియమించామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ 24 రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. పోస్టల్‌బ్యాలెట్, ఎలక్ట్రానిక్ పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ ఒకటో టేబుల్ ఎన్నికల పరిశీలకుడు, రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఏర్పాటు చేశామన్నారు.

జల్లిపేటలో కార్డన్ సెర్చ్

రామచంద్రపురం, మే 23: రామచంద్రపురంలో గురువారం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది, క్యూఆర్టీ సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ పత్రాలులేని 14వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. యజమానులు పత్రాలు తీసుకువచ్చి వాహనాలను తీసుకువెళ్లవచ్చన్నారు. పత్రాలు లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కె.సురేష్‌బాబు తెలిపారు. అనుమానాస్పదంగా సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు.

రేపు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల ఉద్యోగాలకు పరీక్ష

అమలాపురం టౌన్, మే 23: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్ష నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉదయం 9నుంచి 11.30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులను ఉదయం 7.30నుంచి 8.15గంటల వరకు కేంద్రానికి అనుమతిస్తారు. ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పిరియడ్‌లో 8.30గంటల వరకు అనుమతిస్తారు. జిల్లాలో 180మందికి ఒకే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆ ప్రకటనలో వివరించారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్.. 4000లీటర్ల డీజిల్ స్వాధీనం

తాళ్లరేవు, మే 23: యానాం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న డీజిల్ ఆయిల్ ట్యాంకర్‌ను రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు సివిల్‌సప్లయ్ అధికారిణి లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈఆయిల్ ట్యాంకర్‌లో రూ.8,39,000 విలువైన 4000లీటర్లు డీజిల్ ఉన్నట్లు గుర్తించారు. యానాంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి ఆయిల్‌ట్యాంకర్ డ్రైవర్ గోవాల సుబ్బారావు అలియాస్ సుధీర్ టాటాఏస్ వాహనం ద్వారా లీటరు రూ.84కు కొనుగోలుచేసి తదుపరి మోటార్, పైపు సహాయంతో ఆయిల్ ట్యాంకర్ వాహనంలోకి మళ్లిస్తున్నారు. ట్యాంకర్, టాటా ఏస్ వాహనం యజమాని అడ్డాల వీరవెంకటసత్యనారాయణ ఆదేశాలతోడీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ చేపలు, రొయ్యల చెరువుల మోటార్ ఇంజన్లకు లీటరు రూ.88కు విక్రయిస్తున్నారు. ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్‌చేసి రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులకు కోరింగ పోలీసులకు సిఫార్సు చేశారు. ఈతనిఖీల్లో రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి, విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, డీఎస్‌వో ప్రసాద్, సివిల్ సప్లయ్ మండల అధికారిణి టి.లక్ష్మీప్రసన్న, రమణలక్ష్మీదేవి, లోవరాజు పాల్గొన్నారు.



పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద ఆయిల్ ట్యాంకర్‌ను పట్టుకున్న దృశ్యం

రియల్టర్ల దాహానికి బలవుతున్న పచ్చదనం

అనధికారికంగా కొబ్బరి చెట్లు నరికివేత



గొల్లపుంతకాలనీలో కాల్వగట్టుపై ఇరిగేషన్‌శాఖకు చెందిన కొబ్బరిచెట్లను రియల్టర్ అనధికారికంగా నరికివేసిన దృశ్యం

మండపేట, మే 23: పర్యావరణానికి దోహదపడే పచ్చటి కొబ్బరిచెట్లను రియల్టర్లు లేఅవుట్ల కోసం అడ్డగోలుగా నరికేస్తున్నారు. మండపేట పట్టణంలోని రామచంద్రుడు డెడికేటెడ్ చానల్‌కు సంబంధించి గొల్లపుంతకు వెళ్లే పంటబోదెను ఆనుకుని ఇరిగేషన్ శాఖకు చెందిన పలు కొబ్బరి చెట్లు ఉన్నాయి. వాటిని గురువారం ఒక వ్యక్తి అడ్డగోలుగా నరికేశారు. జేసీబీ సాయంతో తొలగించిన చెట్లు అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. గొల్లపుంతకాలనీలో రియల్ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవటంతో పంటకాల్వలు, డ్రైన్లకు చేర్చి ఉన్న భూములకు డిమాండ్ పెరిగింది. ఇరిగేషన్ శాఖకు చెందిన కాల్వగట్టున చేర్చి ఉన్న కొబ్బరి చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా రాజకీయ నాయకుల పలుకుబడితో నరికేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ చెందిన కాల్వగట్లతో పాటు మున్సిపల్ స్థలాలను సైతం లేఅవుట్లలో కలుపుకుంటున్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన రియల్టర్ ఇరిగేషన్ శాఖ చెట్లను నరికినప్పుడు అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు ఇప్పుడు అదే అవకాశంగా ఇరిగేషన్ శాఖకు చెందిన కొబ్బరి చెట్లను నరికేసుకుంటూ పోతుంటే కొంతకాలనికి కాల్వగట్లపై పచ్చదనం కనుమరుగవుతాది.

వెండి మకరతోరణం బహూకరణ

అమలాపురం రూరల్, మే 23: బండారులంక శ్రీవిజయచాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరానికి చెందిన శ్రీఅమ్మ సిల్క్స్ అధినేత మావూరి సుందరరావు కుటుంబసభ్యులు అమ్మవారికి గురువారం వెండి మకరతోరణం బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుందరరావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, లక్కింశెట్టి నిత్యానందం పాల్గొన్నారు. అనంతరం 5వేల మందికి అన్నసమారాధన చేశారు.



రఘురామకృష్ణరాజుకు ఘన స్వాగతం




రావులపాలెం, కొత్తపేటలలో రఘురామకృష్ణరాజుకు స్వాగతం పలుకుతున్న దృశ్యాలు

రావులపాలెం, మే 23: ఉండి అసెంబ్లీ కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజుకు రావులపాలెంలో ఘన స్వాగతం లభించింది. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావుతో పాటు పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఆర్ఆర్ఆర్ ఫ్లెక్సీ చూపుతూ ఆహ్వానించారు. అనంతరం చిలువూరి సతీష్‌రాజు ఇంటి వద్ద రఘురామ టీ బ్రేక్ చేశారు. అక్కడకు అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై ట్రిపుల్ ఆర్‌తో సతీష్‌రాజు ముచ్చటించారు.

కొత్తపేట: నర్సాపురంఎంపీ, ఉండి అసెంబ్లీ కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుని దర్శనం అనంతరం కొత్తపేట విచ్చేశారు. ఆయనకు బస్టాండు సెంటర్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, టీడీపీమండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు. దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు చూపిస్తున్న అభిమానాన్ని మరువలేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాశ్‌నారాయణ, కోటిపల్లి దామోదర్, అద్దంకి చంటిబాబు, పెనుమళ్ల అన్నవరం, ముత్యాల చినస్వామి, తమ్మన సాయిప్రసాద్, శ్రీకాకోళపు గోపాలకృష్ణ, వైఏ రాంబాబు, రాయి దుర్గారావు, కిరణ్ పాల్గొన్నారు.

రఘురామను కలిసిన టీడీపీ నేతలు

అల్లవరం, మే 23: నరసాపురం ఎంపీ, ఉండి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కె.రఘురామకృష్ణరాజును టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలిశారు. అల్లవరం టీడీపీ మండల కార్యాలయం నుంచి అయినవిల్లి వినాయకస్వామి ఆలయం వరకు అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు తరలివెళ్లారు. నార్గన శ్రీనివాసరావు, పచ్చిమాల ఏడుకొండలు, రాసూరి రాఘురాంబాబు, మామిడిశెట్టి శ్రీరామ్, పోతుల నాగరాజు, కటికిరెడ్డి బాబీ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనసేవ



అమలాపురం రూరల్, మే 23: బండారులంకలో శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్లను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణ, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన గ్రామోత్సవంలో మహిళలు స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు సమర్పించారు. వాహన సేవలో అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత బిళ్ల విశ్వేశ్వరరావు-వీరభద్రకాళి దంపతులు విశేష పూజలు జరిపారు. ఎంపీటీసీ అంకం హిమబారతి, కొప్పాడి దుర్గారావు, లంకాడి శ్రీను, లంకాడి ప్రసాద్, ఓలేటి శ్రీనివాసరావు, చింతపట్ల బాబు, అంకం పెదరాజు, బళ్ల సాయి పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి

అమలాపురం టౌన్, మే 23: అన్నమయ్య జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని భూపయ్య అగ్రహారంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం ఆర్ట్ ఫ్యామిలీ సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఆలయ పునర్వసు మండపంలో కోలాటం జరిపారు. సంస్థ ప్రతినిధులు టి.సౌమ్యలక్ష్మి, పేరి వాణి, ఉషారాణి శిష్య బృందం ఆధ్వర్యంలో అన్నమాచార్య, రామదాసు కీర్తనలు ఆలపించారు. మృదంగంపై రఘునాథ్, వయోలిన్‌పై గణపతి సహకారం అందించారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, కొత్తూరి శ్రీనివాస్, జిల్లెల్ల గోపాల్, పవన్, చిన్నా, బాలభక్త సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఆర్పీ కాండ్రేగుల కుటుంబానికి రూ.1.70లక్షల సాయం

అల్లవరం, మే 23: మొగళ్ళమూరులో సీఆర్పీ కాండేగ్రుల రామసత్యనారాయణ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబానికి రూ1.70లక్షల సాయాన్ని ఎంఈవోలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పీఈటీలు, ఐఈఆర్టీలు అంద జేశారు. ఎంఈవో కిరణ్‌బాబు, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఎస్టీయూ నాయకులు ఎన్‌పీజీ నాయుడు, కె.రత్నరాజు, యూటీఎఫ్ నాయకులు కాకిలేటి సురేష్, కేఎస్వీ సత్యనారాయణ, ఎన్.శివప్రసాద్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: మిరల్
శేఖర్ స్ర్కీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్ర్కీన్-2	: దర్శిని
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: నటరత్నాలు

బుచ్చిబాబు విజయం కోరుతూ పాదయాత్ర

ఐ.పోలవరం, మే23: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) విజయం కోరుతూ ఆయన అభిమానులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. జి.మూలపొలం నుంచి జి.వేమవరం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర సాగింది. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంగాని వీరబాబు, పోతాబత్తుల వెంకట్రావు, ఉంద్రు గంగాధర్, వైదాడి రాంబాబు, నూకరత్నం, చింతా లక్ష్మణ్, ముదునూరి ధనబాబు, కొక్కిర్లపాటి పండు తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన

మలికిపురం, మే 23: లక్కవరంలోని విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్రశిక్షా ప్రాజెక్టు అధికారి ఎ.మధుసూదనరావు పరిశీలించారు. నాడు-నేడు పనులను పరిశీలించి నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. కార్యక్రమంలో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎం.విజయశ్రీ, సత్యనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గురువు రామనాథ్ కన్నుమూత



ఆత్రేయపురం, మే 23: పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆస్థాన పండితుడు, ఆధ్యాత్మిక గురువు, ప్రముఖ రచయిత హరి రామనాథ్ గురువారం కన్నుమూశారు. కృష్ణతత్వాన్ని ప్రజలకు చేరవేయాలనే సంకల్పంతో దేశవ్యాప్తంగా తీర్థయాత్రలు చేస్తూ 40ఏళ్ల క్రితం ర్యాలి గ్రామానికి చేరుకున్న ఆయన జగన్మోహినీ కేశవస్వామి సన్నిధిలో ఆధ్యాత్మిక సేవలో ఉండిపోయారు. ప్రతిరోజూ సాయంత్రం తన ప్రవచనాలతో భక్తులను సన్మార్గంలో నడిపించేవారు. 200కుపైగా ఆధ్యాత్మిక రచనలు చేశారు. రామనాథ్‌మృతికి పలువురు సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అమలాపురంటౌన్, మే23: అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల్లో గురువారం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఓపెన్‌విభాగంలో తోలేటి శ్రీకాంత్, ద్రాక్షారపు సాత్విక్, తాడి వెంకటేష్, చింతపల్లి సూర్య విజయవాడలో జరిగే రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్టు జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. మహిళలవిభాగంలో గెద్దాడ అక్షయ, బి.బ్లెస్సీ, పణిశెట్టి ధరణి, పెదమల్లు జాస్మిత హిందూపురంలో జరిగే రాష్ట్ర మహిళలచెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యానిధిప్రిన్సిపాల్ బి.సుధీర్‌బాబు ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యాకానుకపై సమగ్రశిక్షా ఏపీసీ తనిఖీ

రాజోలు, మే 23: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని, పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఫేజ్-2 పాఠశాలల్లో అన్ని పనులను పూర్తిచేయాలని, పాఠశాలల పునఃప్రారంభంలోపు పాఠశాలల పాయింట్లకు విద్యాకానుక కిట్లు అందించే విధంగా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు సూచించారు. ఈసందర్భంగా ఆయన గురువారం శివకోటిలో ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు ఫేజ్-2 పనులను తనిఖీ చేశారు. పనుల పురోగతికి సంబంధించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యాకానుకకు సంబంధించి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ఎస్.మనోహరం, ప్రసాదరావు పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, మే 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యం జరిగే సుదర్శన హోమానికి నర్సాపురానికి చెందిన వన్నెంరెడ్డి వెంకటకృష్ణారావు-లక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం గురువారం అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందించి అభినందించారు. స్థానాచార్యులు రంగాచార్యులు, కంప్యూటర్ అసిస్టెంట్ నరసింహ పాల్గొన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు. మామిడిపండ్లు, విసినకర్రలు స్వామివారికి సమర్పించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాజోలు, మే 23: మండలంలో శుక్రవారం నుంచి జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో ఎస్.మనోహరం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 150మంది, రాజోలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 150మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఈనెల 24నుంచి జూన్ 3వరకు పరీక్షలు ఉదయం 9.30నుంచి 12.45గంటల వరకు జరుగుతాయన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా స్కూల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల షెడ్యూల్ వాయిదా

కలెక్టరేట్(కాకినాడ), మే 23: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం, శనివారం జరగాల్సిన ప్రవేశాల కౌన్సెలింగ్ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ సంస్థ జిల్లా సమన్వయ అధికారి వెల్లడించారు.

పీడీఎస్‌యూ నేతపై కేసు ఉపసంహరించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే23: తెలంగాణ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులపై ఇల్లందు పోలీసులు పెట్టిన కేసును ఉపసంహరించాలని పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్దూ కోరారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులపై మోపిన కేసులేతెస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించి, ఇప్పుడు విద్యార్థి నాయకులపై కేసులు పెట్టడం దారుణమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, మే 23: నరేంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, గంటిపెదపూడి ఫీడర్లలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉడిమూడి, ఆదిమూలంవారిపాలెం, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గుత్తులవారిపాలెం, గంటిపెదపూడి లంకగ్రామాలు, పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన పెదమల్లంక, శిర్రావారిలంకలకు సరఫరా ఉండదన్నారు.

పశు వైద్య సహాయకులకు ద్రవ నత్రజని పాత్రలు పంపిణీ

అమలాపురం రూరల్, మే 23: అమలాపురం ఏరియా పశు వైద్యశాల ప్రాంగణంలో అల్లవరం, అమలాపురం, పి.గన్నవరం మండలాల పశు వైద్య సహాయకులకు పశు సంవర్థక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ద్రవ నత్రజని పాత్రలను గురువారం పంపిణీ చేశారు. ఆరు ట్రాన్స్‌పోర్ట్ మోడల్ ద్రవ నత్రజని పాత్రలను బోడసకుర్రు, తుమ్మలపల్లి, గున్నేపల్లి అగ్రహారం, గంగలకుర్రు అగ్రహారం, పోతవరం, కుందాలపల్లి గ్రామాలకు అందజేసినట్టు డాక్టర్ మూర్తి తెలిపారు. ఎదకు వచ్చిన పశువులకు చూడి కట్టించేందుకు ఎక్కువ దూరం తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని ఇంటి వద్దనే పశువైద్య సహాయకులు వచ్చి వైద్యం చేస్తారని తెలిపారు. కృత్రిమ గర్భధారణ వల్ల పశువులు ఆలసటకు గురికావని, కట్టు శాతం పెరుగుతుందని, రైతులకు సమయం కలసి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో సాయినాథ్, మణికంఠ, అశోక్, చినబాబు, రాజీవ్, వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవు ప్రాణాలను కాపాడిన యువకులు

ఉప్పలగుప్తం, మే23: వాసాలతిప్ప పంటకాల్వలో గురువారం ఒక ఆవు ప్రమాదవశాత్తూ పడిపోయింది. గట్టెక్కలేక కొనఊపిరితో ఉన్న ఆవును అల్లవరం మండలం నక్కారామేశ్వరానికి చెందిన అగ్నికుల క్షత్రియ యువకులు రక్షించారు. చల్లపల్లి వెటర్నరీ అధికారి కేవీరామారావ ఆవుకు చికిత్స చేశారు.

మాజీ సర్పంచ్ మృతి



మలికిపురం, మే 23: మట్టపర్రు మాజీ సర్పంచ్, ప్రముఖ టీడీపీ నాయకుడు కడలి నాగేశ్వరరావు గురువారం మృతిచెందారు. ఆయన మట్టపర్రు సర్పంచ్‌గా 1991-95, 2001-06లలో పనిచేశారు. ఏఎంసీ డైరెక్టర్‌గా, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా, ఎస్సీ సెల్ మండల కార్యదర్శిగా పనిచేశారు. ఆయన కుమార్తె కడలి దుర్గాదేవి ప్రస్తుతం మట్టపర్రు సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. నాగేశ్వరరావు మృతిపట్ల టీడీపీ శ్రేణులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, రాపాక నవరత్నం, కనుమూరి నరసింహరాజు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, మే23: విశ్వేశ్వరాయపురంలో జరిగిన అగ్నిప్రమాదంలోగృహం దగ్ధమైంది. బాధితురాలు నేదునూరి మహాలక్ష్మికి 'నిన్నువలే పొరుగువారిని ప్రేమించు' అనే గ్రూపు ద్వారా సేకరించిన రూ.7500 గురువారం అందజేశారు. జాన్‌మోషే, మట్టా రవి, జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, ఉంద్రు రాజేష్ పాల్గొన్నారు.

వివేకానందలో జీవ వైవిధ్య దినోత్సవం

మలికిపురం, మే 23: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద పాఠశాలలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ భూమి మీద అన్ని ప్రాణులు మనగలగాలి, దానిని జీవ వైవిధ్యం అంటారని, ప్రతీ జీవి పరస్పరం సహకరించుకుంటూ బతుకుతాయన్నారు. జీవ వైవిధ్యంతోనే జీవితం, ఆహారం కోసం జీవ వైవిధ్యం, నీటి కోసం జీవ వైవిధ్యం వంటి గోడ పత్రికలను ఆవిష్కరించారు. నక్కా రమేష్‌బాబు, ఉప్పుగంటి సునీత పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.65వేలు విరాళాలు

ఆత్రేయపురం, మే 23: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గురువారం తూర్పుగోదావరి రాజమహేంద్రవరానికి చెందిన శిరిగిరి జగన్నాథం-రాధా దంపతులు రూ.51,116, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన తోట మురళీమోహన్ రూ.14 వేలు విరాళంగా సమర్పించారు. దాతలకు ఈవో భూపతి రాజు కిషోర్‌కుమర్ స్వామి వారి చిత్రపటాలు అందజేశారు.

NAME CHANGE

I,NAGABATHULA PUSPA LATHA W/o NAGABATHULA BALA VEERA SWAMY 3-129, Bebanagar Pulletikurru Ambajpeta Mandal, Dr.B.R. Ambedkar Koanaseema District. AP-533239. I Have Changed my name from Rokkala Pushapalatha (Old name) to Nagabathula Puspa Latha (new name) shell hence for the be known Nagabathula Puspa Latha for all practical purposes.